# మా ఆవిడంటే నాకు భయమే

• శ్రీమతి ఆ. భాస్కరమ్మ •

భుజంగరావు కూనిరాగాలు తీసికొంటూ, చాలాసరదాగా యింటికివచ్చాడు. నిర్మల గబగబా యెదురురాగా వెళ్లి ఈవేళ చాలా హుషారుగా ఉన్నారే ? ఏమిటికథ ? అంది. నేనెప్పుడు హుషారుగా లేను ? నిన్ను తలచుకొంటో ఉంటే, నిన్ను చూస్తో ఉంటే నాకంతా హుషారే. హుషారిచ్చే మనిషి యెదురుగా ఉంటే హుషారుకేమి లోపం ? అన్నాడు. నిర్మలకోటు బొత్తాములు తీస్తో ఏమిటిది ? నీనోరేదో వాసనవేస్తోంది ? ఏమయినా వేసివచ్చావా యేమిటి ? చెప్పు. నాకిందుకే పెద్ద ఆఫీసర్లంటేనేభయం. పెద్ద ఆఫీసరు కాగానే చేతినిండా డబ్బుంటుంది. మంచిహోదా, అథారిటీ ఉంటాయి. సర్వస్వతంత్రులు. ఎవరేమనుకొంటారో అనే భయముండదు. వాళ్లచిత్తం. వాళ్లే చెడపనిచేసినా మంచిపనిగానే యుంటుంది. వారే అందరికీ ఆదర్శం.

భుజంగరావు. — చంపావు. నానోరు వాసనకూడా వేస్తోంది ? వాసన ఉంటుందనుకోలేదు నేను. ఈవేళ మామేనేజరు ఆఫీసర్ల కందరకు చిన్న టీపార్టీ చేశాడు. ఈరోజున క్రిష్టమసు పండుగని తెలుసు కదానీకు. దొరల ఆచార ప్రకారం టీ అయిన తరువాత అందరూ కొంచెం వైను త్రాగాలి. ఒకరి క్షేమం ఒకరు కోరుతో ఆలా త్రాగక పోతే వారినవమాన పరచినట్లు. వచ్చినవాళ్లంతా త్రాగుతున్నారు. నాకు తెలుసు నన్ను నీవు బ్రతుకనీయవని ముందుగ్లాసు తీసికొనుటకు వెనుక తీశాను. దొరగారే చేతికందిచ్చారు. ఇక త్రాగననడం ఏలాచెప్పు ? దొరకు నామీద యెక్కువ అభిమానము, గౌరవము అని తెలుసును కదానీకు ? అంతా త్రాగుతో ఉంటే, దొరగారెంతో ప్రేమతో నాకు గ్లాసందిస్తే త్రాగనని మూర్ఖంగా అక్కడ పెడితే వాళ్లంతా ఏమనుకొంటారు ? దొరకు కోపం రాదు ? నీవేదో పెద్ద యుపన్యాసం మొదలుపెట్టావుకాని నిర్మలా ! నేనాలాటివాడనా చెప్పు.



నిర్మలకు దుఃఖం వచ్చింది: కళ్లనుండి నీళ్లుకారుతోన్నాయి. కొంతసేపటి వరకూ ఏమీమాట్లాడ లేకపోయింది. ధైర్యం తెచ్చుకొన్నది. మావాళ్లంతా పెద్ద ఆఫీసరును తీసికొనివచ్చి పెళ్లి చేస్తామంటే వాళ్లమాట వినక వాళ్లను ధిక్కరించి ఉద్యోగము దొరుకునను నమ్మకము లేని ఈ నిరుద్యోగపు రోజులలో ఇంకా చదువు పూర్తికాని నిన్నుకోరి పెండ్లిచేసి కొన్నదెందుకు ? నీవు బుద్ధిమంతుఁడవనీ, సిగరెట్టైనా కాల్చవని, నన్నెంతో ప్రేమిస్తో, చాలా గౌరవంగా చూస్తావని. అప్పుడే అన్నారు మావాళ్లు నీవు ప్రేమించిన భుజంగం మాత్రం రేపు పెద్ద ఆఫీసరయితే అతను మాత్రం సిగరెటు కాల్చకుండా. త్రాగకుండాఉంటాడా అప్పుడేమి చేస్తావని ? అప్పుడు నేను చెప్పాను కదా అసలతను అటువంటివేమీ

చేయఁడు. ఒకవేళ ఏ స్నేహితులయొక్క ప్రోద్బలము చేతనైనా చేశాడో నేనుచెప్పి అతనిచేత మాన్పించగల నను ధైర్యము నాకున్నదని.

భుజంగం నిర్మలను దగ్గరకు తీసికొన్నాఁడు. కళ్లు తుడుస్తో నిర్మలా! ఏమిటిది ? ఇంతమాత్రానికే నేనేమో త్రాగుబోతు నయినట్లు ఈలా భయపడి యేడుస్తోన్నావు! ఈ రోజున తప్ప యిదివరకెప్పుడైనా యీలా చేశానా చెప్పు ? మేనేజరు దొర ఎంతో ప్రేమతో ఇస్తాఉంటే ఏంచేయమంటావు ? పోనీ నీవైతే ఏంచేస్తావో చెప్పు.

నిర్మల:— నేనయితే ఒక్కనాటికి త్రాగను. మేనేజరు కానీ, దొరకానీ, చివరికి చక్రవర్తికానీ, నాకిష్టంలేని పదార్థాన్ని నాచే ఎలా తినిపిస్తారు ? దిట్టంగా సిగరెట్టు కాల్చడం, త్రాగడం, మాంసం తినటం, ఇష్టంవచ్చిన స్త్రీలతో సరదాగా కాలం గడపటం ఇదిప్రస్తుతపు, నవ నాగరికత. ఆలాటివేమీ చేయకపోతే నాగరికత తెలియని అడవి మనిషి అని ఎక్కడను కొని పోతారో అని తక్కిన వారికి భయం వాళ్లకిష్టం లేకపోయినా. దాని పేరే **Weakness** అంటారు. నాదగ్గర ఆ **Weakness** లేదు అందులోనూ ఈలాటి చెడ్డ విషయాల్లో. ఈలా ఒకటి రెండు సార్లు ఇతరుల ప్రోత్సాహంవలన దిగుతారు తరువాత అది ముక్కు పట్టుకుంటుంది. తరువాత వానిని తప్పించడం బ్రహ్మతరంకాదు. నాకిష్టంలేదు నేను త్రాగనంటే మీదొర కొడతాడానిన్ను ? ఉద్యోగం తీసేస్తాడు ? ఎవరెంత బలవంతం పెట్టినా ఇంకెప్పుడూ త్రాగనని, సిగరెట్టు అయినా కాల్చనని నాకు వాగ్దానంచేయాలి.

భుజంగరావు:— నీవు దీనినింత సీరియసుగా తీసికొంటావనుకోలేదు నిర్మలా! ఈవేళ యింత గందరగోళమయాక ఇంకా చేస్తానా ? ఇంకెప్పుడూ చేయను.

మేనేజరు కూతురు పుట్టినరోజు వచ్చింది. తనదగ్గరి ఆఫీసర్లను, స్నేహితులను టీకి పిలిచాడు. టీ అయాక వైను ఇచ్చారు. భుజంగరావు తీసికోలేదు. సిగరెట్టు ఇచ్చారు తీసికోలేదు. తక్కినవారంతా తీసుకొన్నారు. ఏం నీవెందుకు తీసికోవు ? అంతా తీసికొంటావుంటే నీవొక్కడవు ఆలా తీసికోననడం మర్యాదాకాదు తీసికో అన్నాఁడు వీపుమీద ప్రేమగా తడుతో మేనేజరు. నాకిష్టంలేదు నేను తీసికోననడానికి ధైర్యములేదు భుజంగరావుకి. ఏమి చెప్పడానికీ తోచడంలేదు. చటుక్కున మా ఆవిడ కోప్పడుతుంది అన్నాఁడు. అక్కడ వాళ్లంతా పకాలున నవ్వారు. వేళాకోళాలు చేశారు. భుజంగరావు ఏమిమాట్లాడలేదు. మీ అవిడంటే నీకంత భయమా అన్నాఁడు మేనేజరు. మాఆవిడంటే నాకుభయమే అన్నాడు భుజంగం. తరువాత ఎక్కడ టీపార్టీ అయినా ఎన్నిసార్లు టీపార్టీలయినా భుజంగరావు వొక్కడూ ఏర్పాటుగా ఉండేవాఁడు. సిగరెట్టు కాల్చడనీ, త్రాగడనీ. పరస్త్రీలను తనతోబుట్టువులవలె ఎంతో గౌరవంగా చూస్తాడనీ. భార్యఅంటె అపరిమితమైన అనురాగము, భయము అని, ఎంత అవకాశమున్నా లంచం తీసికోడనీ. చివరకు ప్రజంట్లు కూడా ఇష్టపడడనీ అతనియొద్ద అన్నీ మంచిగుణములే కాని యెంచి చూద్దామన్నా చెడ్డగుణము లేమీ లేవనీ దొరగారికి నానాటికీ అతనియందు ప్రేమ. గౌరవము హెచ్చినవి. త్వరలోనే అతను చాలా పెద్ద ఉద్యోగి అయాఁడు. గాని పెద్ద యుద్యోగులకుండే పై లక్షణములేవీ మాత్రం అతని కబ్బలేదు.

మీరందరు తప్పకుండా
చదివి తీరాల్సిన పుస్తకం !

జాజిమల్లి

(ఆంధ్ర మహిళలో సీరియల్‌గా ప్రచురింపబడిన నవలానిక)

గ్రంథకర్త :
కీ. శే. కులపతి అడివి బాపిరాజుగారు

150 పేజీలు :: వెల 1-8-0

ప్రతులు దొరుకుస్థలము :
హిగ్గిన్‌బాదమ్స్ అన్ని బుక్‌స్టాల్సు,
వెంకట్రామా అండ్ కో.,
ఆంధ్ర మహిళా ప్రెస్, మద్రాసు-4.